క్లుప్తంగా

భద్రాచలం పయనమైన వృద్ధులు



భద్రాచలం బయలుదేరిన వృద్ధులు

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన రాహుల్ సౌరభ్ నిత్యాన్నదాన సత్రం వృద్ధులు భద్రాద్రి సీతారాముల దర్శనానికి బుధవారం బయలుదేరారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ వీరం దరినీ భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ డాక్టర్ వినీత్ ఆర్థిక సహాయంతో స్వామివారి దర్శనానికి తీసుకెళు తున్నారు.

పుస్తకాల పంపిణీ



విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీజీఎం, తదితరులు

రేగిడి: మండలంలోని దేవుదల కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం యాజమాన్యం బుధవారం పుస్తకాలు పంపిణీ చేసింది. విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని డీజీఎం (కేన్) రమేష్‌రెడ్డి, ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుప్పిలి గవరయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కెంబూరి శ్రీహరినాయుడు, ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజ్యలక్ష్మి, కేజీబీవీ ప్రిన్సిపాల్ రోహిణి, హెచ్ఆర్ మేనేజర్ వి.మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నవదుర్గ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

రాజాం సిటీ: నగరంలోని బస్టాండ్ ఆవరణలో కొలువైన నవదుర్గ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, భక్తుల సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించామని ఈఓ పి.శ్యామలరావు తెలిపారు. మొత్తం 92 రోజులకు గాను 2,13,418 రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ ఈఓ బీవీ మాధవరావు, పర్యవేక్షకులు కూరాడ వెంకటరావు, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యం రోగులకు వరం..



ఖండ్యాంలో గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: దీర్ఘకాలిక రోగులకు ఆయుర్వేద వైద్యం ఓ వరమని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి ఎం. సునీల్‌కుమార్ అన్నారు. గ్రామంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించి, గర్భిణులకు మందులు అందజేశారు. అలాగే బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ కె. శైలజ, అంగన్వాడీ కార్యకర్త నక్క జగన్మోహిని, రమణమ్మ, ప్రభావతి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు



డ్యాన్స్ చేస్తున్న పదో తరగతి విద్యార్థులు

బొబ్బిలి రూరల్: మండలంలోని చింతాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం దీవెనమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులు వీడ్కోలు సభ నిర్వహించగా, విద్యార్థులంతా బాగా చదివి పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని హెచ్ఎం, సిబ్బంది సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. సినీ గీతాలకు విద్యార్థులు నృత్యం చేసి సందడి చేశారు.

జగనన్నది పేదల ప్రభుత్వం

- మహిళలకు తొలి ప్రాధాన్యం
- జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి



మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, చిత్రంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, తదితరులు

బాడంగి: రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, మహిళలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్న సర్కారు అని జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వెలుగు శాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల, మహిళల పక్షపాతిగా పాలన సాగిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేనంతగా మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఖ్యాతి గడించారన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు ఇంటింటికి అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అన్ని శాఖల్లో 50 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తున్నారన్నారు. వేసవిలో నీటి కోసం మహిళలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ముందుగానే ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోపు అన్ని గ్రామాల్లో కూడా వీటిని పూర్తి చేస్తారన్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా మూడో విడతగా మండలంలో 10,629 మంది మహిళలకు రూ.4కోట్ల 70 లక్షల వరకు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తున్నారని చెప్పారు. మహిళలు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని నమ్మి పథకాలన్నీ మహిళల పేరున అమలు చేయడాన్ని ప్రతిపక్షాలు తట్టుకోలేక విమర్శలు చేస్తున్నాయన్నారు. తొలుత ఐసీడీఎస్ అంగన్‌వాడీల ద్వారా పోషణ పక్వాడా ద్వారా ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించారు. పదార్థాలను రుచి చూశారు. పశు సంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన డైరీ యూనిట్లను తిలకించారు. వెలుగు ద్వారా పీఎంఈజీపై కింద మంజూరైన ఎంబ్రాయిడరీ మిషన్‌ను డీఆర్‌డీఏ పీడీతో కలిసి తిలకించారు. ముందు వైఎస్సార్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, బుడా ఛైర్మన్ ప్రతినిధి ఇంటి గోపాలరావు, ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, తెర్లాం జెడ్పీటీసీ ప్రతినిధి గర్బాపు రామారావు, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, మండల ప్రత్యేకాధికారి యశోధరరావు, ఎంపీడీఓ అక్కారావు, తహసీల్దార్ బాలమురళీకృష్ణ, ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి, ఏపీఎం భాగ్యలక్ష్మి, ఏఓ శిరీష, సీసీలు, పొదుపు సంఘాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పరామర్శ



వెంకటాపురంలో సర్పంచ్ వెంకటనాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రేగిడి: మండల పరిధిలోని ఏవీ పురం సర్పంచ్ చుక్కా వెంకటనాయుడును రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు బుధవారం పరామర్శించారు. సర్పంచ్ కుమార్తె చుక్కా వినీత ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. ఈ సందర్భంగా వెంకటనాయుడుతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. పరామర్శలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, కరణం సుదర్శనరావు, మామిడి వేణునాయుడు, పాలవలస రామచంద్రినాయుడు, తాడేల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి కేరాఫ్ చంద్రబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: అవినీతికి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో బుధవారం మాట్లాడారు. ప్రజలను మోసం చేయడంతో పాటు అవినీతికి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా యువతకు శిక్షణ పేరిట దాదాపు రూ.371 కోట్లు అవినీతికి పాల్పడినట్లు అసెంబ్లీ సమావేశాలలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి డైరెక్ట్‌గా విమర్శలు చేశారన్నారు. రాజకీయాల్లో ప్రలోభాల పర్వం చంద్రబాబుతోనే మొదలైందని విమర్శించారు. 2015లో కూడా ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి కేసు నుంచి తప్పించుకునేందుకు రాత్రికి రాత్రి హైదరాబాద్ విడిచి అమరావతిలోని అక్రమ నివాసానికి చేరుకున్నారన్నారు.

ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన పనులు చేయడమే ఆయన ధ్యేయమన్నారు. సంక్షేమ పథకాలు మధ్యవర్తులు లేకుండా నేరుగా అర్హులైన లబ్ధిదారులకు అందించడమే ముఖ్యమంత్రి జగన్ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, బుడా ఛైర్మన్ ప్రతినిధి ఇంటి గోపాలరావు, పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, మండల జేఏసీ ఛైర్మన్ చింతల సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు వరం వైఎస్సార్ కంటి వెలుగు



కంటి వెలుగు కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న జెడ్పీ ఛైర్మన్, ఎమ్మెల్యే

బాడంగి: రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం కంటి సమస్యలున్న విద్యార్థులకు వరమని జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద కంటి వెలుగు ద్వారా కళ్లద్దాలు అవసరమైన వారికి బధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 97 మంది విద్యార్థులకు కంటి వెలుగు ద్వారా కళ్లద్దాలు పంపిణీ చేసినట్టు ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు తెలిపారు.

సీతారామ, లక్ష్మణుల విగ్రహాల వితరణ



సీతారాముల పంచలోహ విగ్రహాలను అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: శ్రీరామనవమి సందర్భంగా స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయానికి ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు రూ.30 వేలు విలువ చేసే విగ్రహాలు గురువారం వితరణ చేశారు. శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయస్వామిల పంచలోహ విగ్రహాలను బాబా ఆలయం పంతులు చేతికి అందించారు. గురువారం రాముల వారి కల్యాణం చేయనున్నారు. కార్యక్రమంలో పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, మండల జేఏసీ ఛైర్మన్ చింతల సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు సహకరించాలి



ఆరికతోట గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట గ్రామంలో పాత కక్షల కారణంగా కొద్ది రోజుల వరకు పోలీసు పికెటింగ్ నిర్వహిస్తామని, శాంతిభద్రతలకు సహకరించాలని బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు అన్నారు. ఎస్ఐ సురేంద్రనాయుడుతో కలిసి బుధవారం ఆయన ఆరికతోట గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత కక్షల నేపథ్యంలో రోడ్డు ప్రమాదం ద్వారా హత్య చేసేందుకు పాల్పడిన కారణంగా గ్రామంలో పోలీస్ పికెటింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగిలే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైఎస్సార్ ఆసరాపై సమీక్ష



సంతకవిటిలో సమీక్ష జరుపుతున్న జగన్ మోహనరావు

సంతకవిటి: ఏప్రిల్ 3న చేపట్టనున్న వైఎస్సార్ ఆసరా చెక్‌ల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి జెడ్పీ వైస్ ఛైర్మన్ సిరిపురపు జగన్ మోహనరావు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మండలానికి మంజూరైన నగదు వివరాలతో పాటు లబ్ధిదారుల గురించి అడిగి తెలుసుకున్నారు. కొన్ని గ్రామాల్లో చిన్న చిన్న అభ్యంతరాలు తమ దృష్టికి వచ్చాయని, సిబ్బంది ద్వారా వాటిని పరిష్కరించాలని ఏపీఎం సీతారామ్‌నకు సూచించారు. మండలంలో జరిగే చెక్కుల పంపిణీ కార్యక్రమానికి రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, సీసీలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

ఆ నలుగురూ తప్పు ఒప్పుకోవాలి..

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యేలు చేసిన తప్పు ఒప్పుకోవాలే తప్ప తిరిగి తప్పును కప్పిపుచ్చుకునేందుకు బుకాయించి మాట్లాడడం మంచి పద్ధతి కాదని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని చిన్నశిర్లాంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని ఏ ఒక్కరూ కాదనలేరన్నారు. ఇటీవల నిర్వహించిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలో సదరు వ్యక్తులు క్రాస్ ఓటింగ్ చేయడం సరికాదన్నారు. ఇటువంటి వ్యక్తుల వల్ల పార్టీకి ముప్పు ఏర్పడుతుందని భావించిన ముఖ్యమంత్రి వారిని సస్పెండ్ చేసినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్ మోహన్‌రావు, వంగర పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, మామిడి వేణునాయుడు, కెల్ల మన్మథరావుల ఉన్నారు.

ఆశీల వేలం ఖరారు..



వేలం నిర్వహిస్తున్న కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని ఆశీల వసూళ్లకు వేలం ఎట్టకేలకు ఖరారైంది. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ డీటీవీ కృష్ణారావు సమక్షంలో నిర్వహించిన వేలంలో పాటదారులు పాట దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. గత ఏడాది రూ. 35.45 లక్షలు ఉన్నపాట విలువను తగ్గించాలంటూ పాటదారులు పట్టుబట్టారు. దీనిని తగ్గించే వీల్లేదంటూ వేలం మూడు సార్లు వాయిదా వేసిన విషయం విధితమే. అయితే చేసేదేమీ లేకపోవడంతో అధికారులు గత ఏడాది పాటను అధికారులు ఖరారు చేస్తూ పాట ప్రారంభించారు. ఈ వేలంలో శాసపు రాజేష్ అందరి కంటే అధికంగా రూ. 35.70 లక్షలకు పాడి పాటను దక్కించుకున్నారు. అలాగే పట్టణంలోని కమేశాను గత ఏడాది కంటే రూ. 3 వేలు అధికంగా పాడి రూ. 62 వేలకు అదే వ్యక్తి దక్కించుకున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ వేలంపాట కాల పరిమితి ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో వర్గపోరు

- రేగిడిలో వేర్వేరుగా పార్టీ జెండా ఆవిష్కరణ

రేగిడి: మండలంలో తెలుగుదేశం పార్టీ వర్గ విభేదాలు బుధవారం బట్టబయలయ్యాయి. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రేగిడి గ్రామంలో మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు సోదరుడు మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణంనాయుడు కొంతమంది అనుచరులతో టీడీపీ జెండా ఎగురవేయగా, రాజాం టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ వర్గం ఉంగరాడమెట్ట వద్ద పార్టీ జెండాను ఎగురవేసింది. ఇంతవరకూ లోగుట్టుగా ఉన్న టీడీపీ వర్గపోరు బహిర్గతం కావడంతో పార్టీ కార్యకర్తల్లో నైరాశ్యం అలముకుంది. కోండ్రు మురళీమోహన్‌కు రాజాం నియోజకవర్గ టీడీపీ టిక్కెట్‌ను నిరాకరిస్తూ కిమిడి కళా వర్గీయులు అంతర్గతంగా గత కొంతకాలంగా పార్టీపెద్దలను కలుస్తున్నట్టు వస్తున్న ఊహాగానాలకు తాజా పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి.

అలజంగిలో పశువిజ్ఞాన బడి

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగిలో పశు విజ్ఞానబడి కార్యక్రమాన్ని పశుసంచార వాహన వైద్యాధికారి డాక్టర్ ఎం.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో 85 పశువులకు సంతానోత్పత్తి , ఆరోగ్య తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వేసవిలో పశువులకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

నాణ్యత బాగుంది..

రేగిడి: కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న భవన నిర్మాణాల్లో నాణ్యత బాగుందని క్వాలిటీ కంట్రోల్ డీఈఈ డీవీ చలం అన్నారు. మండలంలోని పెద్దశిర్లాం, అంబకండి గ్రామాల్లో నిర్మిస్తున్న ఆర్‌బీకే భవనాలు, లక్ష్మీపురం ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్, సచివాలయ భవనాల ను బుధవారం పరిశీలించారు. డిజైన్ ప్రకారంగా నిర్మాణాలు చక్కగా జరగడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు క్వాలిటీ కంట్రోల్ ఏఈ వి.రామకృష్ణ, పంచాయతీరాజ్ జేఈ వి.రామకృష్ణ, సర్పంచ్ కంబూరు తేజా వెంకటేశ్వరరావు, కరణం ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలపై ప్రజావేదిక



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

రాజాం: మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలో జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీలపై బుధవారం ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీడీఓ బాసూరి శంకరరావు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించగా, సామాజిక తనిఖీల ఎస్ఆర్‌పీ చిరంజీవి, డీఆర్‌పీలు రామకృష్ణ, అప్పలనాయుడుల బృందం తనిఖీల వివరాలు వెల్లడించింది. మండలంలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి 14 రోజులుగా క్షేత్ర స్థాయిలో ప్రతి పంచాయతీలో సామాజిక తనిఖీలు నిర్వహించడంతో పాటు గ్రామసభలు పెట్టినట్లు ఎస్ఆర్‌పీ వెల్లడించారు. మండలం మొత్తంపై ఉపాధి పథకంతో పాటు అనుసంధాన శాఖల ఆధ్వర్యంలో రూ. 9,82,94,358 వేతన అమౌంట్‌తో పాటు 2,53,78,273 రూపాయల మెటీరియల్ పనులతో కలిపి మొత్తం 12,36,72,631 రూపాయల పనులపై ఆడిట్ జరిగిందన్నారు. అయితే ప్రతి పంచాయతీలో 30 శాతం మేర ఎవెన్యూ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్ మొక్కలు కనిపించలేదని తెలిపారు. మొక్కలు లేని ప్రాంతాల్లో మళ్లీ నాటాలని డ్వామా సోషల్ ఆడిట్ జిల్లా ప్రొసీడింగ్ అధికారి జనార్దనరావు సూచించారు. పది పంచాయతీల్లో బల్క్‌మిల్క్ కేంద్రాల నిర్మాణానికి సంబంధించిన నిధులు పంచాయతీరాజ్ శాఖ ద్వారా విడుదలైనా, భవనం నిర్మాణాలు ప్రారంభం కాలేదని ఆడిట్ టీమ్ వెల్లడించగా, నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తిచేసి జిల్లా విజిలెన్స్ కార్యాలయానికి వివరాలు అందజేయాలని జిల్లా విజిలెన్స్ అధికారి రవీంద్రరావు సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మీపతి రాజు,ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, మండల పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, ఏపీఓ సాయిరాం , పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరువు గట్లను పరిశీలించిన ఆర్డీఓ



అమ్మిగారి కోనేటి గట్టుపై ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్డీఓ

బొబ్బిలి: పట్టణంలోని అమ్మిగారి కోనేటి గట్టుపై కొందరు అక్రమంగా ఇళ్లను నిర్మిస్తున్నారని మున్సిపల్ కౌన్సిలర్లు చేసిన ఫిర్యాదు మేరకు ఆర్డీఓ పి.శేషశైలజ బుధవారం పరిశీలించారు. తహసీల్దార్ రాజారావుతో కలసి ఆమె రెవెన్యూ సిబ్బందిని వెంటబెట్టుకుని చెరువు గట్టుకు స్వయంగా వెళ్లి పరిశీలించారు. అలాగే తారకరామ కాలనీ అంచునే ఉన్న సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అమ్మిగారి కోనేటి గట్టుపై ఉన్న ఆక్రమణల వివరాలను కలెక్టర్ దృష్టిలో పెడతామని, కొత్తగా ఎక్కడా ఆక్రమణలు చేయకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

సంక్షిప్తంగా...

ముగిసిన గడువు

రాజాం: ఐసీడీఎస్ రాజాం సెక్టార్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు బుధవారంతో గడువు ముగిసిందని సీడీపీఓ తోట కనకదుర్గ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు పోస్టులకు సంబంధించి మొత్తం ఎనిమిది దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. రాజాం మండలం ఆగూరు పంచాయతీ పరిధిలో సీతంపేట(ఎ)లో ఒక అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు ఐదు దరఖాస్తులు, గెడ్డవలస కేంద్రంలో ఆయా పోస్టుకు రెండు దరఖాస్తులు రాగా, సంతకవిటి మండలం గుజ్జన్నపేట కేంద్రంలో ఆయా పోస్టుకు సంబంధించి ఒక దరఖాస్తు వచ్చిందన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

రాజాం సిటీ: స్థానిక మల్లికార్జున కాలనీలోని అనాథాశ్రమంలోని వృద్ధులకు న్యాయవాది రెడ్డి రమేష్ అన్నదానం చేపట్టారు. బుధవారం తన పుట్టిన రోజును వృద్ధుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందని రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పి.శ్రీనివాస్, దీప్తిలావణ్య, షరయునాయుడు, శ్రీకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

బొబ్బిలి రూరల్: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించి, గురువులకు మంచిపేరు తెచ్చి, తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలని స్వామి వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షుడు శంబంగి శంకరరావు సూచించారు. మండలంలో పక్కి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్వామి వివేకానంద యూత్ సొసైటీ తరఫున స్టడీమెటీరియల్ బుధవారం పంపిణీ చేశారు. పలు అంశాలపై విద్యార్థులకు సూచనలు చేశారు. హెచ్ఎం జీవీఎస్ఆర్‌మూర్తి పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ఆరా

వంగర: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు బుధవారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా జరుగుతున్న పనులు, మస్తర్ల నిర్వహణ, పనులు జరిగే ప్రదేశాల్లో సౌకర్యాల కల్పన, వేతనదారులకు అందిస్తున్న వేతనం, పనుల నాణ్యత వంటి అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీఓ సామంతుల సంగంనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బావిరేవతమ్మ ఆలయ నిర్మాణానికి చర్యలు



దాతలతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రాజాం: పట్టణంలోని చీపురుపల్లి రోడ్డులో బావిరేవతమ్మ గుడి నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు అన్నారు. రేవతమ్మ గుడి వద్ద బుధవారం పూజలు చేయడంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలతో మాట్లాడారు. గుడి నిర్మాణానికి స్థలం ఇచ్చేందుకు దాతలు ముందుకురావాలని కోరారు. అందరి సహకారం లభిస్తే భారీ ఆలయం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఆసపు సూర్యం, తిరుమలరావు మాస్టారు, జయరాం, ఈశ్వరరావు, ఎరకన్న, కోల్ల రమ్య, గుంటముక్కల సప్తగిరి పాల్గొన్నారు.

కోదండరాముడికి వెండి కిరీటాల బహూకరణ

రాజాం: పట్టణంలోని తోటపల్లి ప్రాజెక్ట్ డివిజన్ కార్యాలయ కాలనీ వద్ద గల కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల విగ్రహాలతో పాటు లక్ష్మణ, ఆంజనేయ స్వాములకు భక్తులు వెండి కిరీటాలు బహూకరించారు. పలువురు భక్తులు రూ.2.50 లక్షల విలువచేసే కిరీటాలను బుధవారం అందజేసినట్లు అర్చకుడు చొప్పల్లి ప్రసాదశర్మ తెలిపారు.

నేడు సీతారాముల కల్యాణం

కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ ఉంటుందన్నారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరుకావాలని కోరారు.

శ్రీరామనవమికి ముస్తాబైన ఆలయాలు

రాజాం సిటీ: ఈనెల 30న జరగనున్న శ్రీరామనవమి వేడుకలకు పట్టణంతో పాటు మండలంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. ఆయా గ్రామాల్లోని యువకులు నవమి వేడుకల్లో భాగంగా కల్యాణానికి ఏర్పాట్లు చేపడుతున్నారు. పొనుగోటివలస, ఆదర్శనగర్, లక్ష్మీపురం, పొగిరి, బొద్దాం, కంచరాం, తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద పందిళ్లు వేశారు. అంగరంగ వైభవంగా వేడుకలు చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సీతారాముల విగ్రహాల ఊరేగింపు

బొబ్బిలి: పట్టణంలోని పెద బజారులోని రామాలయంలోని సీతారాముల విగ్రహాలను బుధవారం సాయంత్రం ఊరేగించారు. శ్రీ రామనవమి సందర్భంగా ముందుగా విగ్రహాల ఊరేగింపును చేపట్టారు. హనుమంతు వాహనంపై సీతారాముల విగ్రహాలను ఊరేగించడంతో భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

శ్రీరామనవమికి ఏర్పాట్లు

బొబ్బిలి రూరల్: శ్రీరామనవమి సందర్భంగా మండలంలో దిబ్బగుడ్డివలస, పారాది, గొర్లెసీతారాంపురం, పక్కి, చింతాడ, పిరిడి, కారాడ గ్రామాలలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి బుధవారం ఏర్పాట్లు చేశారు. శ్రీరామనవమి పూజలకు పందిళ్లు సిద్ధం చేసి, ఆలయాలు, రామమందిరాలు విద్యుత్ దీపాలతో అలంకరించి, ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.

నేడు షిర్డీ సాయి జన్మదినం

పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల శ్రీ షిర్డీ సాయి ఆలయంలో శ్రీ రామనవమి వేడుకలతో పాటు షిర్డీ సాయి జన్మదినాన్ని కూడా నిర్వహిస్తున్నట్టు ఆలయ పురోహితులు కేఎస్ కృష్ణమూర్తి తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

తెర్లాం: గ్రామంలోని అన్ని వీధుల్లో కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని మండలంలోని చీకటిపేట పంచాయతీ సర్పంచ్ మూడడ్ల పార్వతి అన్నారు. గ్రామంలోని వీధి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్, చెత్తచెదారాలు తీయించే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం బాగుంటుందన్నారు. గ్రీన్ అంబాసిడర్లు వీధుల్లోకి వచ్చినప్పుడు చెత్తను రిక్షాల్లో వేయాలని సూచించారు.

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం రేపు

బొబ్బిలి: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాలుగు మండలాలు, పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 31న మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు సచివాలయ కన్వీనర్లు, నాయకులు హాజరు కావాలని కోరారు.